పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శరత్‌చంద్ర తదితరులు

బండ్లగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలంతా ఆరోగ్యవంతంగా ఉంటారని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్‌లోని వికర్ సెక్షన్ కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అండర్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. జి.వెంకట్‌రెడ్డి, శానిటరీ జవాన్లు శ్రీధర్, సుభాష్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

శంషాబాద్ రూరల్: పాల్మాకులలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనిత, పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



రాజేంద్రనగర్: బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తల్లి వందనం కార్యక్రమంలో భాగంగా ఎర్రబోడ ప్రభుత్వ స్కూల్, సంజీవ హిల్స్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.శ్రీధర్ హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బొక్క బాల్‌రెడ్డి, కోరని సదానంద్, సత్యనారాయణ ముదిరాజ్, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి మేకల వనిత రెడ్డి, హరికిషన్ జీ, సోల్కర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మల్లేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 40 లక్షలు



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన నాయకులు

శంషాబాద్ రూరల్: మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ. 40 లక్షలు మంజూరు అయినట్లు స్థానికులు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ నుంచి ఈ నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కృషి అభినందనీయమని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు నీరటి రాజు, మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్, నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గండిపేట కురుమ సంఘం కార్యవర్గం ఎన్నిక



మణికొండ: గండిపేట మండల కురుమ సంఘం పూర్తి స్థాయి కార్యవర్గాన్ని మంచిరేవులలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో మణికొండలో జరిగిన సమావేశంలో గండిపేట మండల అధ్యక్షుడిగా డి.భాస్కర్ కురుమను ఎన్నుకున్నారు. పాధ్యక్షులుగా రాములు కురుమ, బి. శ్రీనివాస్ కురుమ, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మణ్ కురుమ, కోశాధికారిగా టి. రత్నాకర్ కురుమ, కార్యనిర్వాహక కార్యదర్శిగా వి. హరికృష్ణ కురుమ, సలహాదారుడిగా బి. రాములు కురుమలను ఎన్నుకున్నామన్నారు. సమావేశంలో మండల మాజీ అధ్యక్షుడు యాదయ్య కురుమ, బీజేపీ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు డి. లక్ష్మీనారాయణ, డి. లక్ష్మణ్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న దోమలు

ప్రజలను పగలూ వదలని దోమలు
- నివారణ చర్యలు శూన్యం
- పత్తాలేని ఫాగింగ్
- అధికారుల తీరుపై నిరసన వెల్లువ



ఓపెన్ డ్రైనేజీ

బండ్లగూడ: రోజురోజుకూ విజృంభిస్తున్న దోమలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. నివారణ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైందంటే చాలు దోమలు అధికంగా వృద్ధి చెందుతాయి. ఉదయం, సాయంత్రం, రాత్రి అనే తేడా లేకుండా దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇళ్ల నుంచి బయటకు రానివ్వకుండా ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. కాలనీలలో ఇంటింటికీ తిరిగి దోమల మందు పిచికారీ చేసే కార్యక్రమం అటకెక్కిందనే చెప్పొచ్చు. దీంతో దోమలు వృద్ధి చెంది తద్వారా వ్యాధులు ప్రబలుతున్నాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది.

- గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 200పైగా కాలనీలు ఏర్పడగా 37,718 పైగా నివాస గృహాలు ఉన్నాయి. 2 లక్షల మంది జనాభా ఉంటుందని అంచనా. కార్పొరేషన్ పరిధిలో దోమల మందు పిచికారీ చేసేందుకు కేవలం ఆరు మాత్రమే ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయి. అవి కూడా పాడైపోయాయని తెలుస్తుంది. దోమల మందు పిచికారీ చేయకపోయడంతో సాయంత్రమైతే చాలు దోమలు జనావాసాల్లో చేరి స్వైర విహారం చేస్తున్నాయి.
- గంధంగూడ, పీరంచెరువు, హైదర్‌షాకోట్, హిమాయత్‌సాగర్, దర్గ ఖలీస్‌ఖాన్, బండ్లగూడ, కిస్మత్‌పూర్ తదితర ప్రాంతాలలో దోమల మందు పిచికారీ విస్మరించడంతో వాటి ఉద్ధృతి పెరుగుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- మూసీ పరీవాహక ప్రాంతాల్లో దోమల బెడగ తీవ్రంగా ఉంటుంది. పద్మశ్రీహిల్స్, నర్సారెడ్డి కాలనీ, పీఎన్‌టీ కాలనీ, రాధానగర్, సన్‌సిటీ, గంధం గూడ, సుబ్రమణ్య కాలనీ, శివసాయి నగర్, ఇందిరమ్మ కాలనీ, బైరాగిగూడ తదితర ప్రాంతాలలో దోమల అధికంగా ఉన్నాయి.



చెరువులో కలుస్తున్న వ్యర్థ జలాలు

పెరుగుతున్న జ్వరపీడితులు

- పగలూరాత్రి అనే తేడా లేకుండా దోమలు విజృంభిస్తుండటంతో మున్సిపల్ కార్పొరేషన్‌లో జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దోమ కాటుతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విషజ్వరాలతో బాధపడుతూ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రైవేటు నర్సింగ్‌హోంలలో చికిత్స పొందుతున్నారు.
- పారిశుద్ధ సమస్య పరిష్కారానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా దోమల నియంత్రణ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి దోమల నివారణకు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తగా తీసుకొచ్చిన ఫాగింగ్ మిషన్‌లు

కొత్త మిషన్లతోనైనా...

ప్రజల దోమల బెడద నుంచి కాపాడేందుకు అధికారులు రెండు కొత్త ఫాగింగ్ మిషన్‌లు తీసుకువచ్చారు. దీంతో పాటు మిషన్‌లలో దోమల లిక్విడ్ ఏర్పాటు చేసి బస్తీలలో ఫాగింగ్ చేయించేందుకు రెండు ఆటోలను సైతం తీసుకొచ్చారు. వాటిని ఉపయోగించి అయినా దోమల నివారణకు చర్యలు తీసుకుంటాకేమో వేచి చూడాల్సిందే.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



యూజీడీ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు నాగేందర్, హమీద్‌పటేల్ తదితరులు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి, కొండాపూర్ డివిజన్ల పరిధిలోని మసీదు బండ, సుమధుర , శ్రీరామ్‌నగర్ ఏబ్లాక్, రాఘవేంద్ర కాలనీలలో రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా పని చేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామన్నారు. మసీదుబండ సుమధురలో రూ.55 లక్షలతో, శ్రీరాంనగర్ ఏ బ్లాక్ కాలనీలో రూ.55 లక్షలతో, రాఘవేంద్రకాలనీలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టే యూజీడీ పనులతో చాలా వరకు డ్రైనేజీ సమస్యలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి, కొండాపూర్ కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, జలమండలి మేనేజర్ సందీప్, నాయకులు, కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

ఓంనగర్ కాలనీ అధ్యక్షుడిగా శ్యాములుగౌడ్



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న కాలనీవాసులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ ఓంనగర్ కాలనీలో నూతన కార్యవర్గానికి సోమవారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా టి.శ్యాములుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహా, ట్రెజరర్‌గా బాలాజీనాయక్ గెలుపొందారు. ఈ నూతన కార్యవర్గాన్ని మాజీ కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్‌గౌడ్ అభినందించి సన్మానించారు. కాలనీ నేతలు సుధాకర్, లక్ష్మణ్, ఆశీర్వాదం, విశ్వనాథ్, యాదయ్య, జంగయ్య, కిరణ్, శివశంకర్, పాండు, రామకృష్ణా, శైలేందర్‌సింగ్, వీరయ్య, సమరసింహారెడ్డి, ఓదేలు వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక శాఖ, వాణిజ్య పన్నుల శాఖ, యువజన, క్రీడా శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వాకిటి శ్రీహరి ముదిరాజ్‌ను సోమవారం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సన్మానించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శాలువాలతో సత్కరించారు.

వాణిజ్య నష్టాలు తగ్గించి ఆదాయం పెంపుపై దృష్టి



పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ చీఫ్ మేనేజర్ రాజా రమేష్‌ను సత్కరించిన 'ఎస్కీ' డైరెక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: విద్యుత్ సరఫరాలో నాణ్యతను పెంచి ప్రజల్లో విశ్వసనీయతను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ చీఫ్ మేనేజర్ హెచ్‌ఆర్‌డీ బెండపూడి రాజారమేష్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో కేంద్ర విద్యుత్‌శాఖ నిర్వహించే రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్) కింద నిర్వహించే కార్యక్రమంలో దేశంలో వివిధ రాష్ట్రాల డిస్కంలలో పనిచేసే 2,500 మంది ఇంజనీర్లకు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాణిజ్య నష్టాలు తగ్గించి ఆదాయాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. 'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచడం వలన అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. పవర్ అండ్ ఎనర్జీ హెడ్ విద్యాసాగర్ మాట్లాడారు. కార్యక్రమంలో లడఖ్ పవర్ డెవలప్‌మెంట్, గోవా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ, జమ్మూ డిస్ట్రిబ్యూషన్‌కంపెనీ, తమిళనాడు, తిరుపతి, ముంబాయి, హర్యానా విద్యుత్ శాఖల ఇంజనీర్లకు శిక్షణ ప్రారంభించారు. ఈ సమావేశంలో ఎస్కీ పవర్ అండ్ ఎనర్జీ విభాగం అధికారులు డాక్టర్ విద్యాసాగర్, శ్రీకాంత్, సరస్వతి ,అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు



మాజీ డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

బండ్లగూడ: కాలనీలలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ విద్యానగర్ ఫేస్-2 కాలనీ వాసులు సోమవారం మాజీ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్‌తో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉంటామన్నారు. సమస్యలను ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రల దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారాలు చూపించేలా కృషి చేస్తామన్నారు.

వరదనీటిని ఎప్పటికప్పుడు తొలగించాలి

వెస్ట్ జోన్ జడ్సీ హేమంత్ వాసుదేవరావు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న వెస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్

గచ్చిబౌలి: వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ వాసుదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో హైడ్రా, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హైడ్రా బృందాలతో ఇంజనీరింగ్ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, ఆర్సీపురం, పటాన్‌చెరు సర్కిళ్లలో వర్షం వచ్చినప్పుడు ప్రధాన రహదారులపై భారీగా వరద చేరుతుందని తెలిపారు. నిర్దేశించిన ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు పర్యవేక్షిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, ఉప కమిషనర్లు, ఈఈలు, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



స్పెషల్ డ్రైవ్ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్లపై వ్యర్థాలు, మట్టికుప్పలు, చెత్త లేకుండా చూడటంతోపాటు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం డివిజన్ పరిధిలో జీహెచ్ఎంసీ సిబ్బంది మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... వ్యర్థ పదార్థాలు, మట్టి కుప్పలు ఉండకుండా, ప్రతి రోడ్డు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ముఖ్యంగా మురుగునీరు రోడ్లపై పారకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని కాలనీలు క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండేలా చూసుకోవాలని సూచించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దాలన్నారు. ఏఎంహెచ్‌వో రజనీకాంత్, నర్సింహారెడ్డి, శేఖర్, డివిజన్ అధ్యక్షుడు పాండుయాదవ్, అడికే జనార్దన్, జోగి రవి, రావుల భాస్కర్, బి.నర్సింహ, సంతుగౌడ్, మహేందర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎన్ను శంకర్‌రెడ్డి, కిరణ్, శంకర్, మజార్, సి.హెచ్.ప్రభుదాస్, రమేష్, రాజు, స్వామి, వెంకట్‌రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి



ప్రగతి కాలనీలో మొక్కలు నాటుతున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని.. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రగతి కాలనీ, బృందావన్ కాలనీతో పాటు పలు పాఠశాలల ప్రాంగణాలు, బస్తీ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే నిమిత్తం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గోదా పాండుయాదవ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 11 సంవత్సరాలుగా భారత్ అన్ని రంగాల్లో దూసుకెళ్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందిస్తున్నామన్నారు. ఆయా పథకాలను ప్రజలకు వివరించి లబ్ధిచేకూరేలా చూస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు.

బోనాల జాతరను ఘనంగా చేద్దాం



చెక్కు అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

మణికొండ: ఆషాఢ మాసంలో గ్రామ దేవతలకు నిర్వహించే బోనాల జాతర ఉత్సవాలను ఘనంగా చేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని మణికొండ దేవాలయాల కమిటీ అధ్యక్షుడు, మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం గ్రామ పోచమ్మ దేవాలయానికి రంగులు వేసేందుకు దేవాలయాల అభివృద్ధి కమిటీ తరఫున ఆయన రూ. 2 లక్షల చెక్కును పెయింటర్ బ్రహ్మయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలోని అన్ని దేవాలయాల ఉత్సవాలకు దేవాలయాల అభివృద్ధి కమిటీ తరఫున నిధులను సమకూర్చాలని నిర్ణయించామన్నారు. మణికొండ గ్రామంతో పాటు శివాజీనగర్ దేవాలయానికి అవసరమైన నిధులను సమకూర్చుతామన్నారు. జులై 20వ తేదీన బోనాల ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. అంతలోపు దేవాలయాలను అందంగా తీర్చి దిద్దుతామని తెలిపారు. బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, నాయకులు ఎం. రాఘవరెడ్డి, దేవాలయ నిర్వహణ కర్త రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో చేరండి: ఎంఈవో

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో ఏర్పాటు చేసిన క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో చేరాలనుకునే విద్యార్థులు నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని మండల విద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. మంగళ, బుధవారాలలో మండల స్థాయిలో ఫిజికల్, మెడికల్ పరీక్షలను నిర్వహించి ఎంపిక చేసి వారిని జిల్లా స్థాయికి ప్రమోట్ చేస్తామన్నారు. వారి వయస్సు 8, 9 సంవత్సరాలు ఉండాలని, 4వ తరగతిలో బాలురు 20, బాలికలు 20 సీట్లు ఉంటాయన్నారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, రోయింగ్, వాలీబాల్, జూడో, ఫెన్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, రెజ్లింగ్ క్రీడలతో పాటు చదువులను నేర్పుతారని వివరించారు. వివరాలకు మంగళ, బుధవారాల్లో ఫిజికల్ టీచర్ జోత్స్నను కలిసి తెలుసుకోవాలని ఆయన సూచించారు.

19న అడ్మిషన్ల కోసం ఎంపిక

అత్తాపూర్: రాజేంద్రనగర్ మండల క్రీడా పాఠశాలలో అడ్మిషన్ల కోసం ఎంపిక ప్రక్రియను నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్, జోనల్ కార్యదర్శి కె.గంగ్యానాయక్ తెలిపారు. ఈ నెల 19వ తేదీన శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వంద మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెం, వర్టికల్ జంప్, స్టాండింగ్ జంప్, షటిల్, మెడిసిన్ బాల్ పుట్, ఫ్లెక్సిబుల్ టెస్ట్, ఎత్తు, బరువు తొమ్మిది క్రీడాంశాలపై ఎంపిక నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు 9 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. ఆధార్, కులం సర్టిఫికెట్, బొనాఫైడ్, ప్రోగ్రెస్ కార్డు, ఉండాలన్నారు. బాలురకు 20 సీట్లు, బాలికలకు 20 సీట్లు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఈ మండల ఎంపికలకు అర్హులన్నారు. విద్యార్థులు ఈ క్రీడా ఎంపికను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ



అత్తాపూర్: ముస్లిం, మైనార్టీల విద్యార్థుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని సులేమాన్‌నగర్ డివిజన్ వార్డు ప్రెసిడెంట్ మహమ్మద్ మోసిన్ అన్నారు. మైనార్టీ విద్యార్థుల కోసం ప్రత్యేకించి స్థానికంగా ఉర్దూ మీడియం పాఠశాలను నెలకొల్పారన్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో నవాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మెహిదీపట్నం డిపోలో 'గ్రాండ్ మండే చాలెంజ్'

లంగర్‌హౌస్: గ్రాండ్ మండే చాలెంజ్‌ను పురస్కరించుకొని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో నిర్దేశించిన టార్గెట్ ఎర్నింగ్ ఈపీకేను సాధించిన డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హైదరాబాద్ రీజనల్ మేనేజర్ సుధా పరిమళ సోమవారం మెహిదీపట్నం డిపోను సందర్శించారు. ఇందులో భాగంగా డ్రైవర్లు, కండక్టర్లను ప్రోత్సహించేందుకు పలు బహుమతులు అందజేశారు. మెట్రో డీలక్స్ సర్వీసు బస్సుల్లో ఉద్యోగం చేస్తున్న వారికి హ్యాండ్ మైక్స్‌ను కూడా అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.వి.కృష్ణమూర్తి, అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



టోలిచౌకీలో సబ్‌స్టేషన్ ప్రారంభం



లంగర్‌హౌస్: ప్రజలకు విద్యుత్ కోతలు లేకుండా సక్రమంగా విద్యుత్ అందించడానికి నూతనంగా సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ పరిధిలోని 33 కేవీ హకీంబాబా సబ్‌స్టేషన్ ఫీడర్‌ను ఈ సందర్భంగా ప్రారంభించామన్నారు. ప్రస్తుతం హకీంపేట్, బీఎస్ఎన్ఎల్, హకీంషా, పారామౌంట్ ఫీడర్ అందుబాటులో ఉండగా, నూతనంగా హకీంబాబా ఫీడర్ అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ పాల్గొన్నారు.